

జిల్లాలో వర్షపాతం నమోదు ఇలా..

బెలగాం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం అత్యధికంగా సీతంపేటలో 54.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కొమరాడలో 9.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. సాలూరులో 36.6, బలిజిపేట 31.6, పాలకొండ 38.8, భామిని 23.8, వీరఘట్టం 24.6, పార్వతీపురం 25.4, సీతానగరం 20.0, మక్కువ 27.8, కురుపాం 19.8, గుమ్మలక్ష్మీపురం 18.3, జియ్యమ్మవలస 17.0, పాచిపెంటలో 50.4, గరుగుబిల్లి 20.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసినట్లు జిల్లా అధికారులు వెల్లడించారు.



సాలూరు మండలం మామిడిపల్లి వద్ద నేలవాలిన వరి పంట



సాలూరు పట్టణంలో కురుస్తున్న వర్షం



భామిని: మొక్కజొన్న గింజలపై టార్పాలిన్ కప్పిన దృశ్యం

జోరువాన

- జిల్లాపై 'మొంథా' తుఫాన్ ప్రభావం
- ఈదురుగాలులకు నేలవాలిన వరి.. ముంపులో పత్తి
- నదులు, గెడ్డలకు వరద
- నేడు భారీగా వర్షం కురిసే అవకాశం
- ముందస్తు చర్యల్లో అధికారులు



లివిరిలోని పత్తి పొలాల్లోకి చేరుతున్న వరదనీరు

పార్వతీపురం/రూరల్/గరుగుబిల్లి/సాలూరు/రూరల్/మక్కువ రూరల్/భామిని, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మంగళవారం జోరువాన కురిసింది. ఏజెన్సీలో ప్రాంతాల్లోనూ కుండపోతగా వర్షం పడింది. దీంతో గెడ్డలు, వాగులు, వేగావతి, సువర్ణముఖి, గోముఖి తదితర నదులు ఉధృతంగా ప్రవహించాయి. జలాశయాలకు వరద పోటెత్తింది. గరుగుబిల్లి, సాలూరు, పార్వతీపురం, మక్కువ మండలాల్లోని పలు గ్రామాల్లోని వరి పంటకు నష్టం కలిగింది. వరి చేలల్లోకి నీరు చేరింది. పత్తి పంట తడిసి ముద్దయ్యింది. ఈదురుగాలులు, వర్షం ధాటికి సీతంపేటలోనూ అక్కడక్కడా వరిచేను నేల కొరిగింది. భామిని మండలంలో చీకటితోట గెడ్డ ఉప్పొంగి ప్రవహించింది. పత్తి పొలాలన్నీ ముంపునకు గురయ్యాయి. మొక్కజొన్న గింజలపై టార్పాలిన్లు కప్పి రైతులు పంట రక్షణ చర్యలు చేపట్టారు. పార్వతీపురం మండలంలో సాకి గెడ్డలో వరద ప్రవాహంపెరిగింది. వెంకంపేట, నర్సిపురం తదితర ప్రాంతాల్లో కూలిన చెట్లను విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించారు. అధిక వర్షాలు లేక పోయినప్పటికీ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై ప్రజలు తీవ్ర

(మిగతా 8వ పేజీలో...)

పునరావాస కేంద్రాల సందర్శన

సాలూరు: పట్టణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. విద్యుత్ అంతరాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. భోజన తదితర సౌకర్యాలను అధికారులు కల్పించారు.



తోటపల్లిలో వరద ప్రవాహం

పెద్దగెడ్డ నీరు విడుదల

పాచిపెంట: భారీ వర్షాల కారణంగా పెద్దగెడ్డ జలాశయంలోకి మంగళవారం 6,500 క్యూసెక్కులు చేరగా.. స్పిల్‌వే ద్వారా రెండు గేట్లు ఎత్తి ఆరు వేల క్యూసెక్కులను దిగువకు విడిచిపెట్టారు. మరోవైపు పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి పరిశీలించారు. దిగువ గ్రామాల భద్రతకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పూరిళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అనంతరం పాచిపెంట జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్న గిరిజన విద్యార్థులతో మాట్లాడారు.

నాగావళికి వరద

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి 5,500 క్యూసెక్కుల వరద చేరగా.. స్పిల్‌వే గేట్లు నుంచి 3 వేల క్యూసెక్కులను దిగువకు మళ్లించారు. మరుపెంట, సాంబన్నవలస, సుంకి, తదితర గ్రామాలకు కొంతమేర అసౌకర్యం నెలకున్న దృష్ట్యా ముందస్తుగా మరుపెంటలో పునరావాసం ఏర్పాటు చేశారు. ● భారీ వర్షాలకు అడ్డాపుశీల, సీతారాంపురం ప్రధాన రహదారి , సీతారాంపురం నుంచి ఉల్లిభద్ర వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారింది.



గరుగుబిల్లి: దత్తివలసలో వరిచేలను కాపాడుకుంటున్న రైతు



అడ్డాపుశీల సమీపంలో కోతకు గురైన ప్రధాన రహదారి

రైతులకు అండగా నిలుస్తాం

- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- 90 వేల దోమతెరల పంపిణీ
- మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, పరిహారం చెల్లిస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా ప్రత్యేకాధికారి గుప్త, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి ఇతర అధికారులతో సమీక్షించారు. దెబ్బతిన పంటలను పరిశీలించి నష్టపరిహారంపై నివేదిక అందించాలన్నారు. వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఆమె వెల్లడించారు. సీతంపేట మండలంలో అరటి పంట రైతులకు నిబంధనల పేరిట కష్టం కలిగించే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. రైతుల కష్టాన్ని తెలుసుకుని వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లాపై తుపాను ప్రభావం ఏ విధంగా ఉందనే విషయాన్ని డిజిటల్ స్క్రీన్ ద్వారా కలెక్టర్ వివరించారు. గెడ్డలు, వాగులు, ప్రాజెక్టుల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలో పిడుగులు పడే పరిస్థితి ఉందని, దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే విద్యాలయాలకు సెలవులను పొడిగించాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రాజెక్టు ప్రాంతాల్లో అదే విధంగా ఎక్కడైనా చెరువులకు గండి పడిన వెంటనే ఇసుక బస్తాలను తరలించాలన్నారు. కాగా సాలూరు, మక్కువ ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచామని

(మిగతా 8వ పేజీలో...)



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సీఎం నుంచి మంత్రికి ఫోన్...

కలెక్టరేట్ కంట్రోల్ రూంలో అధికారులతో సమీక్షిస్తున్న సమయంలోనే ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు నుంచి మంత్రి సంధ్యారాణికి ఫోన్ వచ్చింది. తుఫాన్ ప్రభావం, తీసుకుంటున్న చర్యలపై మంత్రి వివరించారు. ఐటీడీఏల పరిధిలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టున్నామన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందిస్తున్నామని, తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎంకు తెలియజేశారు. ఈ సమావేశంలోనే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నుంచి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ రాగా.. జిల్లాలో పరిస్థితిని ఆయన వివరించారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

ప్రజలకు సూచించిన కలెక్టర్

పార్వతీపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో నేడు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. మంగళవారం సాయంత్రం విలేఖర్లతో మాట్లాడుతూ.. 'ఇప్పటివరకైతే హెవీ రైన్‌ఫాల్ నమోదు కాలేదు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా 44 రేషన్ డిపోలకు నిత్యావసర సరుకులకు తరలించాం. 27 గ్రామాలను తుపాను ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించాం. ఆయా ప్రాంత వాసులను సురక్షిత ప్రదేశాలకు తరలించే చర్యలు చేపట్టాం. మన్యంలో 49 హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగింది. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ముందుగానే వరద నీటిని విడుదల చేస్తున్నాం. పార్వతీపురం, సాలూరు, పాలకొండ, పాచిపెంట ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఏదైనా సహకారం కావాలంటే బాధితులు వీఆర్వో లేదా గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించొచ్చు. ముందస్తుగా జిల్లాకు 600 విద్యుత్ స్తంభాలు తెప్పించాం. కాజ్‌వేల మీదుగా రాకపోకలు నిషేధించాం. వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచించాం.' అని తెలిపారు.

ముంచేసిన మొంథా
● ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు
● నీట మునిగిన పంటలు
6లో

గిరిజన విద్యార్థులను బయటకు పంపించొద్దు
● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో స్వప్నిల్ జగన్నాథ్
8లో

సచివాలయ ఉద్యోగులకు రాత్రి విధులు
జిల్లా సాధన కోసం ఉద్యమానికి సిద్ధం
8లో

నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్

పార్వతీపురం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం పెదభోగిలిలో గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. తుఫాన్ నేపథ్యంలో వారు మంగళవారం రాత్రి సచివాలయంలోనే బస చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే వారు ఇళ్లకు వెళ్లిపోవడంతో సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ బి.శంకరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ జి.సుమతి, ఏహెచ్‌ఏ జానకి, ఎంఎస్‌పీ అప్పలనరసమ్మలు సస్పెండ్‌కు గురైన వారిలో ఉన్నారు.

సెస్ అందక.. నిధులు లేక

● కష్టమవుతున్న గ్రంథాలయాల నిర్వహణ

విజయనగరంటౌన్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.8కోట్లు సెస్ బకాయిలు రావాల్సి ఉంది. జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని ప్రథమశ్రేణి, ద్వితీయశ్రేణి, తృతీయశ్రేణి గ్రంథాలయాలతో కలిపి మొత్తం 41 ఉన్నాయి. ఇవి కాకుండా పలుచోట్ల బుక్ డిపో కేంద్రాలను కూడా నిర్వహిస్తున్నారు. అయితే స్థానిక సంస్థలు చెల్లించే సెస్ సొమ్ముతోనే గ్రంథాలయాలు నడుస్తుంటాయి. కాగా స్థానిక సంస్థలు ఇంటి పన్నులతో పాటు గ్రంథాలయ సెస్సు వసూలు చేస్తున్నప్పటికీ ఆ నగదును జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించడం లేదు. విజయనగరం జిల్లాలో 771 పంచాయతీలు, పార్వతీపురంలో 250 పంచాయతీలు ఉండగా వీటికితోడు విజయనగరం, సాలూరు, బొబ్బిలి, నెల్లిమర్ల, పార్వతీపురం మున్సిపాల్టీలు ఉన్నాయి. ఆయా స్థానిక సంస్థలు ఏటా ప్రజల నుంచి ఆస్తిపన్ను వసూలు చేస్తుంటాయి. ఇందులో ఎనిమిది శాతం గ్రంథాలయ సెస్సు ఉంటుంది. అంటే వసూళ్లయిన పన్నుల నుంచి ప్రతి రూపాయి నుండి ఎనిమిది పైసలు చొప్పున జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే చాలా కాలంగా గ్రంథాలయ సంస్థకు ఆ డబ్బులు రావడం లేదు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారుల గణాంకాల ప్రకారం ఒక్క నెల్లిమర్ల మునిసిపాల్టీ నుంచే రూ.50లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. 2024-25 ఏడాదిలో

(మిగతా 8వ పేజీలో...)



విజయనగరంలో గ్రంథాలయ సంస్థ కార్యాలయం

లోతట్టు ప్రాంతంలో మంత్రి పర్యటన
పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆదేశం
8లో

దుగ్గిలో ఏనుగుల గుంపు

● పంటలు ధ్వంసం ● ఆందోళనలో రైతులు

కొమరాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓవైపు వర్షానికి పంటలు దెబ్బ తింటుంటే.. మరోవైపు ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయి. వారం రోజులుగా సోమినాయుడువలస, కుమ్మరిగుంట ప్రాంతాల్లో సంచరించిన ఏనుగుల గుంపు మంగళవారానికి దుగ్గి గ్రామ పరిసరాలకు చేరుకున్నాయి. సమీపంలోని పంట పొలాల్లో సంచరిస్తూ... కాయగూరలు, పత్తి, వరి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. మరోవైపు గజరాజులు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకముందే ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని అధికారులను రైతులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

చెత్తశుద్ధికి చర్యలు

- డంపింగ్‌యార్డులో వ్యర్థాల ప్రోసెసింగ్ యూనిట్
- త్వరలో ప్రారంభం

పార్వతీపురం/ పార్వతీపురం టౌన్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపాల్టీ ప్రజలను వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో డంపింగ్ యార్డు ఒకటి. అయితే దశాబ్దాల ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. స్వచ్ఛంధ్రాప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీకి ఆర్థిక పరిపుష్టి కలిగించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డులో వ్యర్థాలు, చెత్తలు రీ సైక్లింగ్ చేసే యూనిట్‌ను తరుణ్ అసోసి యేట్స్ అనే స్వచ్ఛంద సంస్థకు అప్పగించింది. దీంతో యుద్ధ ప్రాతిపదికన మిషనరీ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. వాస్తవంగా యార్డుకు అనుకొని ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై నుంచి ప్రయాణించాలంటే నరకమే. పాదచారులు, వాహనచోదకులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. అయితే ఎట్టకేలకు డంపింగ్ యార్డుకు ఎదురుగా వ్యర్థాలు, చెత్త రీ సైక్లింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో ప్రజల బాధలు కొంతవరకు తగ్గినట్టేనని చెప్పొచ్చు. ఈ విషయమై మున్సిపల్ ప్రజారోగ్యశాఖ డీఈ వంశీకృష్ణను వివరణ కోరగా రీ సైక్లింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు మిషనరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అసలు జిల్లా కేంద్రమై నాలుగేళ్ల గడుస్తున్నప్పటికీ డంపింగ్ యార్డు తరలింపు అనేది కాగితాలకే పరిమితమైంది. గత వైసీపీ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర డంపింగ్ యార్డు సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిలో భాగంగా యార్డులో చెత్త, వ్యర్థాల రీసైక్లింగ్‌తో పాటు సేంద్రియ ఎరువుల తయారీ బాధ్యతను ఓ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. ప్రభుత్వ నిర్ణయంపై పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చెత్త రీ సైక్లింగ్‌కు సిద్ధమవుతున్న మిషనరీ

ముంచేసిన మొంథా

● ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు ● నీట మునిగిన పంటలు



వంగర: ఆరు గేట్ల ద్వారా మడ్డువలస నీరు విడుదల చేస్తున్న దృశ్యం

మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు నీట మునిగాయి. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. చెరువులు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. రహదారులు దెబ్బతిన్నాయి. వాగులు, గెడ్డలు పొంగి పొర్లుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి బృందం



సంతకవిటి: నాగావళి నది ఉధృతిని పరిశీలిస్తున్న తహశీల్దార్ సుదర్శనరావు



రాజాం రూరల్: మల్లికార్జున కాలనీలో నిలిచిన నీరు



మెంటాడ: ఆండ్ర జలాశయం నుంచి...



గుర్ల: కెల్ల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చేరిన నీరు



విజయనగరం టౌన్: ట్యాంక్ బండ్ రోడ్డులో నీటిని మళ్లిస్తున్న దృశ్యం



భోగాపురం: చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి



భోగాపురం: మూడు గుళ్ల ప్రాంతంలో నిలిచిన నీరు



గజపతినగరం: రామన్నపేటలో కూలిన పూరిల్లు



కొత్తవలస: చీడివలస వద్ద కూలిన వందేళ్ల నాటి మరిడమ్మ చెట్టు



విజయనగరం టౌన్: వైఎస్సార్ కాలనీ రైల్వే వంతెన వద్ద..



విజయనగరం టౌన్: నిర్మానుష్యంగా రైల్వే స్టేషన్



గంట్యాడ: రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును పరిశీలిస్తున్న పోలీసులు



బొండపల్లి: నెలివాడలో వరద నీటిని మళ్లిస్తున్న దృశ్యం



సాలూరు రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న సువర్ణముఖి నది



మక్కువ రూరల్: దుగ్గేరు సమీపంలో అడారి గెడ్డను పరిశీలించిన ఎస్పీ మాధవరెడ్డి



సాలూరు: పునరావాస కేంద్రం వద్ద అధికారులకు ఆదేశాలిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి



మక్కువ మండలం ఎర్రగదబవలస-నంద రహదారిలో కూలిన చెట్టు

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబానో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్దిత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

మొంథా తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు, నాయకులు మంగళవారం పర్యటించి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. అధికారులతో సమీక్షించారు. పునరావాస కేంద్రాలను సందర్శించారు. కావల్సిన ఏర్పాట్లు చేశారు.
(ఆంధ్రజ్యోతి బృందం)

సమీక్షలు.. సహాయక చర్యలు

- మొంథా తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- వివిధ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటన



విజయనగరం: కంట్రోల్ రూంలో ఆన్‌లైన్ ద్వారా సమీక్షిస్తున్న మంత్రి కొండపల్లి, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


పూసపాటిరేగ: కోనాడ పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న ఎంపీ కలిశెట్టి


గుర్ల: తారక రామతీర్థ సాగర్ ప్రధాన కాలువ పనులను పరిశీలిస్తున్న చీపురుపల్లి ఎమ్మెల్యే కళా


ఎస్.కోట: పోతనాపల్లి పునరావాస కేంద్రంలో బిస్కెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి


రాజాం: నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

కంట్రోల్ రూంను పర్యవేక్షించిన మంత్రి

విజయనగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఎదుర్కొవడానికి జిల్లా అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్లు, సహాయక చర్యలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూం నుంచి ఆయన జిల్లా అధికార యంత్రాంగం చేపడుతున్న చర్యలను పరిశీలించారు.

అధికారుల పర్యటన

విజయనగరం టౌన్/ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో నగరంలో ప్రభావితమయ్యే లోతట్టు ప్రాంతాలైన ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్, లోయర్ ట్యాంకు బండ్, పెద్ద చెరువును కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్‌లు మంగళవారం పరిశీలించారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తినా, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వారి వెంట కమిషనర్ నల్లనయ్య ఉన్నారు.

ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవాలి

చీపురుపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగమంతా సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదేశించారు. మంగళవారం ఆయన చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో సత్యవాణి, డీఎల్‌డీవో హేమసుందర్, డీఎస్పీ ఎస్.రాఘవులు పాల్గొన్నారు. ● గుర్ల: ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు మంగళవారం గుర్లలో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక పరిసరాలను పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శృంగవరపుకోట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. లోతట్టు ప్రాంతాలను ఆమె మంగళవారం పరిశీలించారు. పోతనాపల్లి పునరావాస కేంద్రంలో బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీ.ఎస్‌నాయుడు ఉన్నారు. ● ఎస్.కోట రూరల్: సంతగైరమ్మపేటలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే లలితకుమారి మంగళవారం సందర్శించారు. పునరావాసం ఉంటున్న 40 కుటుంబాలతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

పునరావాస కేంద్రానికి తరలింపు

వేపాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బొద్దాం గ్రామంలోని ఊరచెరువు గర్భంలో నివాసం ఉంటున్న యాతపేట చెందిన 10 కుటుంబాలను ఎమ్మెల్యే లలితకుమారి పునరావాస కేంద్రానికి తరలించారు. ఆమె మంగళవారం ఆ గ్రామాన్ని సందర్శించి, వారిని పునరావాస కేంద్రానికి తరలించారు.

● డెంకాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతట్టు ప్రాంతాలను ఆర్డీవో బి.కీర్తి మంగళవారం సందర్శించారు. రఘుమండలో ఆరు కుటుంబాలను గుర్తించి రఘుమండ జడ్పీ ఉన్నత పాఠశాలలోనికి తరలించారు. బంటుపల్లి గ్రామాన్ని సందర్శించారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు పలు ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.

తాటిపూడి రిజర్వాయర్ పరిశీలన

గంట్యాడ, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్‌ను ఎస్పీ దామోదర్ మంగళవారం పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రిజర్వాయర్ పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ ఈఈ వెంకటరమణ ఉన్నారు. ● తాటిపూడి రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు రావడంతో స్పిల్‌వే గేటు తెరిచి కిందకు 6,114 క్యూసెక్కులు నీటిని విడిచి పెడుతున్నట్టు ఇరిగేషన్ ఏఈ శంకర్ తెలి పారు. గోస్తనీ నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని సూచించారు.

గర్భిణులపై అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఈనెలలో ప్రసవాలకు దగ్గరలో ఉన్న గర్భిణులను ఏరియా ఆసుపత్రికి పంపించే దిశగా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి అన్నారు. మరుపల్లి పీహెచ్‌సీని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి

రాజాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మంగళవారం పరిశీలించారు. ఇప్పటికే పలుచోట్ల పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. అనంతరం మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. ● ఒమ్మి, లక్ష్మీపురం గ్రామాల్లో నేలకొరిగిన వరి పంటలను ఎమ్మెల్యే కోండ్రు మంగళవారం పరిశీలించారు. పంట నష్టం నివారణకు వ్యవసాయశాఖ అధికారులు నివేదిక సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు అత్యవసర సేవల కోసం టీడీపీ కార్యాలయం వాట్సాప్ నెంబరు 99510 95888కు సంప్రదించాలన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులు సేవలందించాలి

విజయనగరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సేవలందించాలని, అధికారులే కాకుండా పార్టీ శ్రేణులు కూడా సహాయక చర్యల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. పునరావాస కేందాల్లో అందుతున్న సేవలు, వారికి కల్పించిన వసతులపై విజయవాడ నుంచి ఆమె ఆన్‌లైన్ ద్వారా నిరాశ్రయులతో మాట్లాడారు. ఆమె ఆదేశాల మేరకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా రవి పలువురిని బాబామెట్టలోని పునరావాస కేంద్రానికి తరలించారు.

పునరావాస కేంద్రంలో ఎంపీ భోజనం

పూసపాటిరేగ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర ప్రాంత గ్రామాలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం పర్యటించారు. చింతపల్లి, కోనాడ పునరావాస కేంద్రాలను పరిశీలించారు. కోనాడలో అక్కడి వారికి ఆయన ఆహారం వడ్డించడమే కాకుండా వారితో కలిసి భోజనం చేశారు. మాజీ ఎంపీపీ మహంతి చిన్నంనాయుడు, టీడీపీ నాయకులు దంగా భూలోక పాల్గొన్నారు.


గజపతినగరం: వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి


మెరకముడిదాం: పీహెచ్‌సీలో అధికారులతో సమీక్షిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు


విజయనగరం: పార్టీ నాయకులతో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి


విజయనగరం టౌన్/ క్రైం: కమిషనర్ నల్లనయ్యతో చర్చిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్


ఎస్.కోట రూరల్: పునరావాస కేంద్రంలో తన కుమార్తెకు అన్నం తినిపిస్తున్న తండ్రి


డెంకాడ: పునరావాస కేంద్రం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో కీర్తి


గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్


నెల్లిమర్ల: ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సరోజిని, కమిషనర్ జయరాం


గరివిడి: బంగారమ్మ కాలనీలో పర్యటిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి రవి పటాన్ శక్తి, జేసీ సేతుమాధవన్


భోగాపురం: మత్స్యకారులతో మాట్లాడుతున్న డీఐవో అచ్యుతకుమారి


కొత్తవలస: గవరపాలెం వద్ద గెడ్డ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


డెంకాడ: పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు


నెల్లిమర్ల: నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి శ్రీలక్ష్మి


రేగిడి: బొడ్డవలసలో ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు, పోలీసులు


జామి: మండల కేంద్రంలో ముంపునకు గురైన గంగిరెడ్ల కాలనీ


భోగాపురం: పోలిపల్లి సమీపంలో నీటిలో చేపలు పడుతున్న దృశ్యం


రాజాం: నేలకొరిగిన వరి పంట


వేపాడ: ఈదురుగాలులకు నేలకొరిగిన వరి


దత్తిరాజేరు: వరదనీటిని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్, సిబ్బంది


జామి: రామయ్యపాలెం వద్ద నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏవో పూర్ణిమ

కూరగాయల పంపిణీ

విజయనగరం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన భోగాపురం, పూసపాటిరేగ, మెరకముడిదాం, ఎస్.కోట మండలాలలోని ఎనిమిది గ్రామాల ప్రజలకు ఆటోల ద్వారా కూరగాయలను రైతుబజార్ ధరలకే విక్రయించామని ఏడీ రవికిరణ్ తెలిపారు.

ముందస్తుగా రేషన్..

భోగాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా వచ్చే నెలలో పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం ముందస్తుగానే పంపిణీ చేస్తున్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో తీర ప్రాంత గ్రామాల్లో గల 17 చౌకధరల దుకాణాల్లో కార్డుదారులకు రేషన్ అందజేశారు.

తప్పిన ప్రమాదం

విజయనగరం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలిలో ఓ భవనంపై ఉన్న హోర్డింగ్ నుంచి బ్యానర్ క్లాత్ గాలికి సిగ్నల్ పాయింట్ వద్ద పడిపోయింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడం వల్ల ప్రమాదం తప్పింది.

శాశ్వత పరిష్కారం చూపాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని పేదల కాలనీల్లో కాలువ నిర్మించి ఇళ్లల్లోకి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. మంగళవారం ముంపునకు గురైన రామకృష్ణానగర్, ఎల్‌బీజీ నగర్, జొన్నగుడ్డు, బొంగవీధి తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

ఈవీఎంల గోదాం తనిఖీ

నెల్లిమర్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఈవీఎం గోదాంలను కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. బందోబస్తుపై సమీక్షించారు. సీసీ కెమెరాల ద్వారా చుట్టుపక్కల పరిస్థితులను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. డీఆర్‌వో ఎస్.శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ కె.శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, నెల్లిమర్ల ఎన్నికల విభాగం డీటీ వీవీఆర్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో రక్తదాన శిబిరం

డెంకాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్ఫూర్తితో రక్తదానం చేయడం సమాజానికి ప్రేరణ కలిగిస్తుందని 5వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు అన్నారు. చింతలవలస వద్ద గల 5వ పోలీసు బెటాలియన్ ఆవరణలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 181మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సేకరించిన రక్తాన్ని విశాఖపట్టణం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు. అడిషనల్ కమాండెంట్ సి.రాజారెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.బాపూజీ, ఆర్ఐ ఎం.గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ వచ్చినా పోరాటం ఆగదు


రిలే దీక్షలో పాల్గొన్న నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్ని తుఫాన్లు వచ్చినా తమ నిరసన దీక్ష ఆగదని జిందాల్ నిర్వాసితులు తెలిపారు. మంగళవారం బొడ్డవర గ్రామం వద్ద తమ 130వ రోజు నిరసనలో భాగంగా వారు మాట్లాడారు. తమకు న్యాయం చేయాల్సిన అధికారులు జిందాల్‌కు అనుకూలంగా కోర్టులకు తప్పుడు నివేదికలు ఇవ్వడం బాధ కలిగిస్తుందన్నారు.

సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

విజయనగరం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరం నియోజక వర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఆమె కోరారు.

● విజయనగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్), ప్రసూతి, చైల్డ్ ఆసుపత్రి(ఎంసీహెచ్-ఘోషా)లో ప్రాథమిక మౌలిక సదుపాయాలతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించి(జీజీహెచ్-రూ 2.92 కోట్లు, ఎంసీహెచ్ ఘోషాకి-2.73 కోట్లు) మొత్తం 5.65 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ● విజయనగరం శివారు ప్రాంతమైన వేణుగోపాలపురంలో నూతనంగా 220/132/33 కిలో వాట్స్ సబ్ స్టేషన్‌ను నిర్మించుటకు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ పనులు వేగవంతంగా జరిగే విధంగా చూడాలని పేర్కొన్నారు. ● విజయనగరం నియోజకవర్గ పరిధిలోని నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గత ప్రభుత్వం భూసేకరణ చేసిందని, భూసేకరణ పరిహారాన్ని రైతులకు అందించాలని కోరారు. ● విజయనగరంలోని పెద్ద చెరువు నుంచి పద్మావతి నగర్ వరకూ ప్రధాన కాలువను ఏర్పాటు చేయాలని, ఇందుకు డీపీఆర్‌ని కూడా ప్రభుత్వానికి నివేదించామని, నగరపాలక సంస్థ దీనిని చేపట్టేందుకు నిధుల సమస్య కారణంగా, వీఎంఆర్‌డీఏ ద్వారా ఈ డీపీఆర్ ప్రాప్తికి 32 కోట్ల 51 లక్షలు ఇప్పించాలని కోరారు. ● ఎస్పీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ కూడా డీజీపీ కార్యాలయానికి సంబంధిత నివేదికను అందించారని, దీనికి నిధులు కేటాయించాలని కోరారు.

వరి పంటకు నష్టం

రాజాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నాలుగు మండలాల్లో 159 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు తెలిపారు. మంగళవారం అన్ని మండలాల్లో పర్యటించి పంట నష్టం వివరాలను సేకరించామని చెప్పారు. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ● వేపాడ: వర్షాలకు వేపాడ మండలంలో సుమారు 200 ఎకరాలల్లో వరి పంట నీటి మునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. సిబ్బంది నీటమునిగిన వరి చేలను, నేల కొరిగిన వరి పంటల పరిస్థితిని పరిశీలిస్తున్నారు. అలాగే వర్షాల నుంచి పంటను ఏవిధంగా రక్షించుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. ● నెల్లిమర్ల: మండలంలో సుమారు 5 హెకార్లలో వరిపంట నీటమునిగిపోయినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అధికారులు పరిశీలించి, ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గుర్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెనుబర్తి గ్రామంలో రొంగలి గోవిందరావుకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అందజేశారు. మంగళవారం వారి ఇంటికి వెళ్లి ఈ చెక్కును అందజేశారు. గుర్ల మాజీ ఎంపీపీ వెన్నె సన్యాసినాయుడు, గూడెం పీఏసీఎస్ చైర్మన్ పిల్ల అప్పలనాయుడు, జమ్ముపేట పీఏసీఎస్ చైర్మన్ చనమల్ల మహేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెంటాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టాడ పంచాయతీ మధుర మిర్తివలస గ్రామానికి చెందిన పరదేసి కృష్ణ(52) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణ అనకాపల్లి జిల్లా బయ్యవరం వద్ద ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి బయ్యవరం జంక్షన్ వద్ద కారు ఢీకొట్టిన ఘటనలో కృష్ణ గాయాలపాలయ్యాడు. విశాఖపట్నం షీలానగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. కృష్ణ అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామం తీసుకొచ్చారు. మృతుడికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లారీ ఢీకొని ఒకరు..

రామభద్రపురం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులోగల గాంధీ బొమ్మ దగ్గర మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మారుతీ కాలనీకి చెందిన బండారు చిన్నారావు రోడ్డు పక్కన నిల్చొని ఉండగా ఒడిశా నుంచి బాడంగి వైపు వెళుతున్న లారీ అతనిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి పోలీసులు తరలించారు.

కోర్టు భవనాలు పూర్తయ్యేలా చూడండి

శృంగవరపుకోట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట కోర్టు భవనాలు పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బీవీఎస్ రామారావు తోపాటు సభ్యులు, ఇతర న్యాయవాదులు కోరారు. మంగళవారం వీరంతా ఎల్.కోట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి, సమస్యను వివరించారు. దీంతో వీరి సమక్షంలో ఆమె రాష్ట్ర లా సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడారు. నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ సహాయ న్యాయవాది టీవీఆర్ మూర్తి, నానిగిరి తులసీ వివేకానంద దాస్, రామకృష్ణ, త్రిమూర్తులు, డబ్ల్యూఎస్ శర్మ పాల్గొన్నారు.

జోరువాన

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు పడ్డారు. కాగా మంగళవారం రాత్రి నుంచి అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జిల్లా అధికారులు అప్రమ త్తమయ్యారు. ఇప్పటికే మాక్‌డ్రిల్ నిర్వహించారు. కంట్రోల్ రూమ్‌ల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ.. ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు చేపడుతున్నారు. ● మక్కువ రూరల్: దుగ్గేరు సమీపంలోని అడారిగెడ్డను ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి మంగళవారం పరిశీలించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కాజ్‌వేపై ప్రజల రాకపోకలను నిలిపివేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

రైతులకు అండగా నిలుస్తాం

(5వ పేజీ తరువాయి)

ఇరిగేషన్ శాఖాధికారులు తెలిపారు. అత్యవసరమైతే ప్రజలు 1912, 100 లేదా 101కు ఫోన్ చేయాలని, మరో రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గిరిజన వసతిగృహాల్లో విద్యార్థులకు 90 వేల దోమ తెరలు అందిస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు చేశామని, మందులన్నీ అందు బాటులో ఉన్నాయని వెల్లడించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేయొద్దన్నారు.

సెస్ అందక.. నిధులు లేక

(5వ పేజీ తరువాయి)

అంటే గడిచిన 9 మాసాల్లో సుమారు రూ.2కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. రెండు జిల్లాల నుంచి గడిచిన ఐదేళ్లగా రూ.8నుండి రూ.10 కోట్ల మేర సెస్ బకాయిలు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

కుంటుపడుతున్న అభివృద్ధి

రెండు జిల్లాలో నిర్వహిస్తున్న 41 గ్రంథాలయాల్లో కనీస వసతులు కల్పించాలన్నా చిన్నపాటి మరమ్మతులు చేయాలన్నా నిధులు లేవని అధికారులు చెబుతున్నారు. పాఠకుల కోసం కొత్తపుస్తకాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను సైతం కొంతమంది దాతల సాయంతో కొనుగోలు చేస్తున్నారు. స్థానిక సంస్థలు సెస్సు బకాయిలు ఇవ్వకపోవడంపై జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోనిలక్ష్మీ వద్ద ప్రస్తావించగా కోట్లలో బకాయిలు పేరుకుపోయిన మాట వాస్తవమేనని, అధికంగా మునిసిపాల్టీలు చెల్లించాల్సి ఉందన్నారు. వారు పట్టించుకోకపోవడంతో జిల్లా పంచాయతీ అధికారి దృష్టిలో పెట్టి అన్ని పంచాయతీలకు నోటీసులు పంపించామన్నారు. శతశాతం వసూళ్లకు కృషి చేస్తామని చెప్పారు.

జనజీవనం అస్తవ్యస్తం



లోతట్టు ప్రాంతంలో ఉన్న బైపాస్ కాలనీ

పార్వతీపురం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షంతో పాటు గాలులు వీస్తుండటంతో భయపడుతున్నారు. ఎప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పట్టణం మీదుగా ప్రవహిస్తున్న వరహల గెడ్డ వరద ఉధృతి పెరిగింది. దాంతో ఎప్పుడు ఏం జరుగుతుందోన్న భయం వారిని వెంటాడుతోంది. తుఫాను తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుండడంతో భీతిల్లుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న బైపాస్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో శత్రుచర్ల రియల్ ఎస్టేట్, గణేష్‌నగర్ కాలనీ, సౌందర్య థియేటర్ రోడ్డువీధి, జనశక్తి కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవీ?

కొమరాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగంపై జిల్లా అధికారులు చర్యలు చేపట్టని తీరు పలు అనుమానాలకు తావిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి కొల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నిధుల దుర్వినియోగం విషయంపై నవంబరు 2లోగా వివరాలను బయటపెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే సచివాలయాల ఎదుట నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మరాడన వెంకట నాయుడు, చంటి పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

సీతానగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీడీ త్రివిక్రమరావు అన్నారు. మంగళవారం లక్ష్మీపురంలో ఏపీవో బాలకృష్ణ, జేఈ సోమేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 27,684 మంది వేతనదారులు ఉన్నారని, అందులో 22,276 మందికి ఇప్పటికే ఈకేవైసీ చేయడం జరిగిందన్నారు. చినబోగిలి ఎస్సీ కాలనీలో రూ. 76 వేలతో మ్యాజిక్ డ్రైన్ నిర్మించాలని సంకల్పించామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సర్పంచ్ వితరణ

పాచిపెంట, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రానికి తరలించిన నిరుపేదలకు టీడీపీ మండల అధ్యక్షుడు, పాంచాళి సర్పంచ్ గూడేపు యుగంధర్ ఆహార పొట్లాలను మంగళవారం వితరణ చేశారు. పునరావాస కేంద్రాల్లోని వారికే కాకుండా బయట ఉన్న నిరుపేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నేలకూలిన వృక్షం



నేలకూలిన భారీ వృక్షం

సీతంపేట రూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు కోడిపిల్లలగూడలో మంగళవారం భారీ వృక్షం నేలకూలింది. దాంతో సవర గణేష్‌కు చెందిన బాత్‌రూం నేలమట్టమైంది. చెట్టు కూలే సమయంలో బయట ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వీధి మధ్యలో చెట్టు కూలడంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

ఏజెన్సీలో కుండపోత వర్షం

సీతంపేట రూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో సీతంపేట ఏజెన్సీలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. ఈదురు గాలులు, వర్షం ధాటికి వరిచేను నేలకొరిగింది. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండల ప్రత్యేక అధికారి గణేశ్, తహసీల్దార్ శ్రీకన్య, ఎంపీడీవో మిశ్రో, ఎస్ఐ అమ్మనరావు ఏజెన్సీలో పర్యటించారు. గొయిది సమీపంలో గొయిది గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో పాలకొండ-హడ్డుబంగి రహదారిపైకి వరద రాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా జంగిల్ క్లియరెన్స్ చేయించారు. అలాగే పెదరామ సమీపంలోని కల్వర్ట్ శిథిలావస్థకు చేరడంతో కల్వర్ట్ పైనుంచి వాహనాల రాకపోకలను నిషేధించారు.

అప్రమత్తమైన యంత్రాంగం



గుమ్మలక్ష్మీపురం: కంట్రోల్ రూంలో ప్రభుత్వ విప్ జగదీశ్వరి



సీతంపేట రూరల్ :కుసిమి పీహెచ్‌సీలో ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. తుఫాన్ కారణంగా ప్రజలకు ఎటువంటి నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శేఖరం, అధికారులను ఆమె ఆదేశించారు. మండలంలోని నాలుగు పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా గుర్తించామని అధికారులు ఆమెకు తెలిపారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచినట్టు ఎమ్మెల్యేకు వివరించారు. ఆమె వెంట మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ ధర్మచం ద్రారెడ్డి, టీడీపీ నాయకులు ప్రసాదరావు, రాజేశ్, మన్మథరావు పాల్గొన్నారు.

వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ పరిశీలన

●మక్కువ రూరల్: తుఫాన్ నేపథ్యంలో స్థానిక వెంగళరాయసాగర్ ప్రాజెక్టును మంగళవారం అధికారులు పరిశీలించారు. అధికారులతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డీఈఈ సురేష్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా సాగర్‌లోకి వరదనీరు భారీగానే వచ్చిచేరుతోందని ప్రమాదం జరగకుండా మిగుల జలాలను నదిలోకి విడిచి పెడుతున్నామన్నారు. పరిశీలనలో తహసీల్దార్ కె.భరత్‌కుమార్, ఎంపీడీవో ఎన్.అర్జునరావు, మండల ఇంజనీరింగ్ అధికారి రజిత్‌కుమార్, డిప్యూటీ ఎంఈడీవో న్యూనారాయణ, ప్రాజెక్టు అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

శిథిల భవనాల్లో తరగతులు వద్దు..

●గరుగుబిల్లి: తుఫాన్ నేపథ్యంలో చిలకాం పంచాయతీ కారివలస, శివ్వాం పంచాయతీ సీమలవానివలస పాఠశాలకు చెందిన శిథిలావస్థకు చేరిన భవనాలను మంగళవారం ఎంపీడీవో జి.పైడితల్లి, జేఈ జి.గౌరీశంకర్, ఎంఈవో-2 కె.కొండలరావు పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహించరాదని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

●గుమ్మలక్ష్మీపురం: తుఫాన్ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి మండలంలోని దుడ్డుకల్లు, దొరజమ్మ, తిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు వర్షంలోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శేఖర్, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ అప్పారావు ఉన్నారు.

తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ సమన్వయకర్త, ఎస్టీ కమిషన్ సభ్యుడు కద్రక మల్లేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

●కొమరాడ: తుఫాన్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణ ప్రజలకు సూచించారు. పూసర్లపాడు, కళ్లికోట నదీ పరివాహక ప్రాంతాల్లో ఆయనతో పాటు ఎస్ఐ నీలకంఠం, ఎంపీడీవో మల్లికార్జునరావు, పర్యటించారు. గ్రామాల్లో మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

తడిసి ముద్దయిన కార్యాలయం

●పాలకొండ: తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల రెవెన్యూ కార్యాలయం తడిసి ముద్దయింది. శిథిలావస్థలో ఉన్న కార్యాలయంలో త హసీల్దార్ చాంబర్‌తో పాటు కార్యాలయం అంతా వర్షపు నీటితో నిండింది. తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి కార్యాలయాన్ని మంగళవారం పరిశీలించారు.

భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మన్మథరావు సూచించారు. అన్నవరంలో తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎస్ఐతో ఆయన కలిసి ఆయన పర్యటించారు. కంట్రోల్ రూంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ సేవలందించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం అంపిలి గ్రామంలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం

●సీతానగరం: తుఫాన్ విపత్తులను ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని మండల ప్రత్యేక అధికారి, పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన సువర్ణముఖి నది పరివాహక ప్రాంతాలను మండల అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం కొత్తవలస వద్ద సువర్ణముఖి నది ప్రవాహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రసన్న కుమార్, ఎంపీడీవో వెంకటరావు, ఎస్ఐ ఎం. రాజేష్, ఎంఈవోలు సూరిదేముడు, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

నదీతీర గ్రామాల పరిశీలన

●భామిని: మండలంలోని వంశధార నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి పి.రమాదేవి, డీఎస్పీ రాంబాబు సూచించారు. మంగళవారం లివిరి, సింగిడి, నేరడి గ్రామాలను వారు సందర్శించారు. స్థానికులతో మాట్లాడారు. పరిశీలనలో తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ, ఎంపీడీవో వసంతకుమారి, సీఐ ప్రసాదరావు, ఎస్ఐ అప్పారావు ఉన్నారు.

విద్యార్థులను పంపించవద్దు

●సీతంపేట రూరల్: ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులను బయటకు పంపించవద్దని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. హడ్డుబంగి, మల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం పీవో ఆ కస్మిక తనిఖీ చేశారు. అనంతరం కుసిమి పీహెచ్‌సీని పీవో సందర్శించారు. పీవోతో పాటు డీడీ అన్నాదొర ఉన్నారు. తుఫాన్ ప్రభావంతో ఏజెన్సీలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశించారు. మన్యంలో కురుస్తున్న భారీ వర్షానికి ఉప్పొంగి ప్రవహిస్తున్న గెడ్డలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన తో పాటు గిరిజన సలహా మండలి సభ్యురాలు తేజోవతి ఉన్నారు.

లోతట్టు ప్రాంతంలో మంత్రి పర్యటన



బైపాస్ కాలనీలో పర్యటిస్తున్న మంత్రి సంధ్యారాణి

బెలగాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లోతట్టు ప్రాంతంలో గల బైపాస్ కాలనీలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పర్యటించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష అనతరం మంత్రి కాలనీని సందర్శించారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వరదనీరు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అదే కాలనీలోని బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. మంత్రితో పాటు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన పోలీసులు



రక్తదాన శిబిరంలో ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో బెలగాంలోని పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్పీ మాధవరెడ్డి ప్రారంభించిన రక్తదాన శిబిరంలో పోలీసులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ థామస్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లా సాధన కోసం ఉద్యమానికి సిద్ధం



మాట్లాడుతున్న చౌదరినాయుడు

పాలకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాలకొండ జిల్లా సాధన కోసం రిలే నిరాహారదీక్షలు, ఉద్యమానికి సిద్ధమని పాలకొండ జిల్లా సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తక్షణమే జిల్లా మం త్రి సంధ్యారాణి, ఇన్‌చార్జి మం త్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ తీసుకోవాలన్నారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించాలన్నారు. జిల్లా సాధన కోసం ఈనెల 31 నుంచి నిరాహారదీక్షలను పాలకొండ పట్టణంలో నిర్వహిస్తామన్నారు. కార్య క్రమంలో పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులు కనపాక చౌదరినాయుడు, బుడితి అప్పలనాయుడు, వండాన కూర్మారావు, తుమ్మగుంట శంకరరావు, కడగల వెంకటరమణ, రుంకు రామకృష్ణ, వలూరు సత్యనారాయణ, కిల్లారి విజయ్‌కుమార్, నెల్లి సత్యంనాయుడు, గిరడ రాము, రుద్ర కోటేశ్వరరావు, గిరడ లక్ష్మణరావు, కడగల భాను, జడ్డు బాలరాజు, బెజ్జిపురం చిన్నంనాయుడు, యందవ రాధాకృష్ణ, బుక్కూరు కృష్ణారావు, అల్లిన శ్రీనివాస్, కిల్లారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టంకు గ్రామంలో కూలిన ఇల్లు



కూలిన ఇల్లు ఇదే..

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గొయ్యిపాక పంచాయతీ టంకు గ్రామంలో ఓ ఇల్లు కూలింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ శేఖరం ఆ గ్రామానికి వెళ్లి గిరిజన కుటుంబాన్ని పరామర్శించారు. వారికి నిత్యావసర సరుకులను అందజేశారు. తుఫాన్ తగ్గేవరకు దడ్డుకల్లు ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉండాలని వారికి సూచించారు.

నగర పంచాయతీ సమావేశం రేపు

పాలకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 30న ఉదయం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ రత్నంరాజు ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

కాలువలో పడి ఆవు మృతి



మృతిచెందిన ఆవు

మక్కువ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వెంగళరాయసాగర్ కాలువలో శంబరకు చెందిన బలగ పోలినాయుడుకు చెందిన ఆవు పడి మృతి చెందింది. మంగళవారం ఉదయం ఆవునే మేపేందుకు పోలినా యుడు వెంగళరాయసాగర్ లింక్ చానల్ ప్రాంతానికి తీసుకువెళ్లాడు. ఆవు మేత మేస్తుండగా ప్రమాదవ శాత్తు కాలువలోకి జారిపడిపోయింది. కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆవు పైకి ఎక్కలేక నీటిలో మునిగి మృతి చెందింది. ఆవు మృతి చెందిన విషయాన్ని రెవెన్యూ అధి కారులకు పోలినాయుడు ఫిర్యాదు చేశారు.

మొబైల్ ఫోన్ల చోరీ నిందితుడి అరెస్టు

బెలగాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అపోలో ఫార్మసీ పైన అయ్యప్ప సన్నిధానంలో మొబైల్ ఫోన్ల చోరీ నిందితుడిని పట్టణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ మురళీధర్ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 24న పట్టణంలోని అయ్యప్ప స్వాముల సన్నిధానంలో రెండు మొబైల్ ఫోన్‌లు చోరీకి గురైనట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. మంగళవారం సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా చోరీ నిందితుడు యాండ్రాపు రామకృష్ణ అని గుర్తించి అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు రాత్రి విధులు

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ ఉద్యోగులు మంగళవారం రాత్రి వారి సచివాలయాల్లోనే బస చేశారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలోని 25 సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

బరువు కొలిచే యంత్రాల అందజేత

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీడీపీవో కార్యాలయంలో భద్రగిరి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం పిల్లలకు బరువు కొలిచే పరికరాలను పంపిణీ చేశారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి వాటిని అందజేశారు. కార్యక్రమంలో విజయవాహిని సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు నాగమణి, గౌరి, నిర్మల పాల్గొన్నారు.